క్లుప్తంగా

పారిశుధ్య కార్మికులకు బట్టలు పంపిణీ



బట్టలు అందజేస్తున్న చైర్‌పర్సన్ మాధవి

వేములవాడ: వేములవాడ మున్సిపాలిటీ పారిశుధ్య సిబ్బందికి చైర్‌పర్సన్ మాధవి, కమిషనర్ అన్వేష్ మంగళవారం కొత్త బట్టలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, మారం కుమార్, గోలి మహేశ్, శంకర్ పాల్గొన్నారు.

గోశాలలకు రాజన్న కోడెలు



కోడెలను అందజేస్తున్న ఆలయ అధికారులు

వేములవాడఅర్బన్: వేములవాడ రాజన్న తిప్పాపూర్ గోశాలలోని కోడెలను జనగామ జిల్లాలోని గోశాలలకు మంగళవారం అందజేశారు. జనగామ జిల్లా దేవరుప్పాల మండలం పద్మావతి తండాకు చెందిన పరమేశ్వర గోశాలకు 20 కోడెలు, తరిగొప్పుల మండల కేంద్రానికి చెందిన సహాయోగ్ గోశాలకు 20 కోడెలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు శ్రీనివాస్, నరసింహమూర్తి, శంకర్ పాల్గొన్నారు.

సీఐటీయూ మహాసభలు విజయవంతం చేయాలి



జెండా ఎగురవేస్తున్న అశోక్

వేములవాడఅర్బన్: బెంగుళూర్‌లో ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న సీఐటీయూ అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగుమంటి ఎల్లారెడ్డి అన్నారు. వేములవాడ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రం అశోక్, బట్టు శ్రీకాంత్, మల్లేశం, లచ్చయ్య, చంద్రయ్య, వజ్రమ్మ పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి



మాట్లాడుతున్న విద్యార్థులు

కోనరావుపేట: రైతులు భూసార పరీక్షలను తప్పనిసరిగా చేయించుకోవాలని వ్యవసాయ కళాశాల పొలాస ఫైనల్ ఇయర్ విద్యార్థులు అన్నారు. మండలంలోని మామిడిపల్లిలో జగిత్యాల వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో భూసార, సాగునీటి పరీక్షలపై ఆదర్శ రైతు సొసైటీ రైతులకు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మట్టి పరీక్షల కోసం మట్టి నమూనాను సేకరించే విధానం, నేల ఆరోగ్యం పెంచుకోవడానికి చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. విద్యార్థులు అనూహ్య, గాయత్రి, జ్ఞాన ప్రసన్న, మానస, నవ్య, రమాదేవి, సాయి తిలక్, నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

తైబంది సరే.. మరమ్మతులేవీ?

- పూడుకుపోతున్న మానేరు ప్రాజెక్టు కెనాల్
- 10 వేల ఎకరాల ఆయకట్టుకు నీరు
- చెత్త, గుర్రపు డెక్కతో నిండిపోయిన కెనాల్స్

ముస్తాబాద్: ఎగువ మానేరు ప్రాజెక్టు ఆయకట్టుకు సాగునీటి సరఫరా గండం పట్టుకుంది. ప్రాజెక్టులో పుష్కలంగా నీరు ఉన్నా, చివరి ఆయకట్టుకు సాగునీటి సరఫరా సాఫీగా అయ్యే పరిస్థితులు కనిపించడం లేదు. యాసంగిలో అన్నదాతలు పెద్ద ఎత్తున సాగుకు సమాయత్తం అయిన నేపథ్యంలో ఎగువ మానేరు ప్రాజెక్టుపై ఆధారపడి సాగు చేస్తున్న రైతులు కెనాల్స్ దుస్థితి చూసి ఆందోళనకు గురవుతున్నారు. నెల రోజుల క్రితమే ముస్తాబాద్ మండలానికి 10 వేల ఎకరాల సాగుకు తైబందీ నిర్ణయించి నీటిని విడుదల చేశారు. అయితే ప్రాజెక్టు కుడికాలువ కింద వున్న పది గ్రామాల్లోని షట్టర్లు, కెనాల్స్ చెత్త, పూడిక, గుర్రపు డెక్కతో నిండిపోవడమే రైతుల ఆందోళనకు ప్రధాన కారణం.



ముస్తాబాద్‌లో డీ-18 రెగ్యులేటరీ దుస్థితి



మరమ్మతుకు నోచుకోని పోతుగల్ కెనాల్ షట్టర్



గుర్రపు డెక్కతో నిండిపోయిన తెర్లుమద్ది కెనాల్

ప్రతిపాదనలకు మంజూరు ఎప్పుడో.?

ఎగువ మానేరు ప్రాజెక్టు కింద ముస్తాబాద్ మండలంలో కుడి కాలువ ద్వారా 9 వేల 42 ఎకరాలకు తైబంది నిర్ణయించారు. రికార్డుల పరంగా ఇదీ నిర్ణయించినప్పటికీ అనధికారికంగా మరో పది వేల ఎకరాలను సాగు చేస్తున్నారు. ఈనేపథ్యంలో మూడేళ్లుగా కెనాల్స్, షట్టర్ల మరమ్మతులకు నీటి పారుదలశాఖ అధికారులు ప్రతిపాదనలు చేస్తున్నారు. రూ.64 కోట్ల ప్రతిపాదనలకు ఇప్పటి వరకు మోక్షం లభించడం లేదు. కుడికాలువ కింద మల్లారెడ్డిపేట వద్ద వున్న లోతు చెరువులో ప్రస్తుతం 13 ఫీట్ల నీరు ఉండగా, కెనాల్ చివరి ఆయకట్టుకు నీరందాలంటే కనీసం 16 నుంచి 19 ఫీట్లు ఉండాలి. లోతుచెరువు వద్ద మరమ్మతు చేస్తే నీటిని నిల్వ చేసుకోవచ్చు. అలాగే గూడూరు వద్ద స్లూయిస్, డీ-18 వద్ద రెగ్యులేటరీ ధ్వంసమైంది. డీ-12 వద్ద తూము మరమ్మతు చేయాల్సి వుంది. 20 కిలోమీటర్ల పరిధిలో ప్రధాన కెనాల్‌తోపాటు పిల్ల కాలువలున్నాయి. తెర్లుమద్దికి వెళ్లే కెనాల్‌లో డీ-20 వద్ద మరమ్మతు చేయాల్సి వుంది. ముస్తాబాద్, నామాపూర్ కెనాల్స్‌లో పూడికతో నిండిపోయింది. గుర్రపు డెక్క వల్ల నీటి ప్రవాహం మందగించింది. ముఖ్యంగా ముస్తాబాద్, పోతుగల్ కెనాల్స్‌లో చెత్త పేరుకుపోయింది. గూడెంలో సబ్ కెనాల్స్ ఆనవాళ్లు దెబ్బతింటున్నాయి. రాంరెడ్డిపల్లె వద్ద అదే పరిస్థితి నెలకొంది.

'ఉపాధి'తో శుభ్రం

ఉపాధి హామీ పనుల ద్వారా కెనాల్ వున్న గ్రామ పంచాయతీలు తీర్మానం చేస్తే, కాలువలను శుభ్రం చేయవచ్చు. కూలీల ద్వారా ఉపాధి హామీ పథకంలో పనులు చేపడితే గుర్రపు డెక్క, చెత్తను తొలగించే వీలుంటుంది. అలాగే కెనాల్స్ ఇరువైపుల వున్న పిచ్చి చెట్లు, తుంగను తొలగించవచ్చు. గతేడాది పనులు చేపట్టినా, ఈ యాసంగికి ముందే కెనాల్స్ దెబ్బతిన్నాయి. తైబందీ నిర్ణయించినప్పుడే కెనాల్స్‌ను బాగు చేస్తే నీరు వృథా కాదని రైతులంటున్నారు. గతంలో కెనాల్స్‌ను లష్కర్లు పరిశుభ్రం చేసేవారు. ఎక్కడ నీరు వృథాకాకుండా పర్యవేక్షించే లష్కర్లు లేకపోవడం సమస్యగా మారింది.

మరమ్మతు చేయాలి



తైబందీకి ముందే మానేరు కెనాల్ శుభ్రం చేయాలి. ప్రతి వానకాలం, యాసంగి పంటలకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ముస్తాబాద్‌లో కెనాల్స్ బాగా దెబ్బతిన్నాయి. చివరి ఆయకట్టుకు నీరందే పరిస్థితులు కనిపించడం లేదు. ప్రణాళికతో పనులు చేస్తే పంటలు చేతికి అందుతాయి.
– ఒరగంటి తిరుపతి, మాజీ సర్పంచ్

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



ప్రాజెక్టుకు చివరి గ్రామమైన తెర్లుమద్దికి ప్రతి సీజన్‌లో అన్యాయం జరుగుతుంది. ఈ విషయంపై ఇరిగేషన్ డీఈఈ, ఈఈ దృష్టికి తీసుకెళ్లాం. డీ-19 నుంచి డీ-22 వరకు బాగు చేయాలని కోరాం. కెనాల్స్ శుభ్రం చేయాలి. ప్రాజెక్టులో నీరు ఉన్నా, నీటిని సక్రమంగా వాడుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపాం.
– బైతి నవీన్, తెర్లుమద్ది

ప్రతిపాదనలు చేశాం



మానేరు కెనాల్స్, షట్టర్ల మరమ్మతులకు ప్రతిపాదనలు చేశాం. నిధులు మంజూరు రాలేదు. రాగానే పనులు చేపడుతాం. లష్కర్ల నియామకం జరిగింది. వారు డ్యూటీల్లో జాయిన్ అయ్యారు. వారి ద్వారా కెనాల్స్ బాగు చేయిస్తాం. చివరి ఆయకట్టుకు నీరందిస్తాం. రైతులు ఆందోళన చెందొద్దు.
– వంశీకృష్ణ, ఏఈ, ఇరిగేషన్, ముస్తాబాద్

నల్ల బెలూన్లతో ఒకరు.. ఫ్లెక్సీతో మరొకరు

- మంత్రి కేటీఆర్ పర్యటనలో నిరసన సెగలు
- నిరసనకారుల అరెస్టు



నల్ల బెలూన్లతో నిరసన తెలుపుతున్న శేఖర్



ఫ్లెక్సీతో దూసుకువస్తున్న శ్రీనివాసరెడ్డి

తంగళ్లపల్లి: మండల కేంద్రంలో మంగళవారం మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా నల్ల బెలూన్లతో నిరసన తెలిపేందుకు ప్రయత్నించిన సిరిసిల్ల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చుక్క శేఖర్ యత్నాన్ని పోలీసులు అడ్డుకున్నారు పద్మశాలీ సంఘం ఆవరణలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహావిష్కరణ చేయాల్సి ఉండగా నల్ల బెలూన్లు ఎగురవేసి నిరసన తెలుపుదామని పక్కనే పైఅంతస్తులో ఉన్న కాంగ్రెస్ కార్యాలయంలో దాక్కున్నాడు. కాని ముందే పసిగట్టిన స్పెషల్ బ్రాంచ్ పోలీసులు తాళం పగులగొట్టి లోపలికి చొచ్చుకెళ్లి శేఖర్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జాలగం ప్రవీణ్(టోని)ని ఇంటిలోనే హౌజ్ అరెస్టు చేశారు.

కొదురుపాకలో ఫ్లెక్సీతో నిసరన

బోయినపల్లి: సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు మిడ్‌మానేరు ప్రాజెక్టు నిర్వాసితుల ఇళ్ల నిర్మాణాలకు రూ. 5.04 లక్షలు ఇవ్వాలని మండలంలోని నీలోజిపల్లికి చెందిన కొండం శ్రీనివాసరెడ్డి ఫ్లెక్సీతో కొదురుపాక చౌరస్తాలో మంగళవారం నిరసన వ్యక్తం చేశాడు. పోలీసుల భారీ బందోబస్తు ఉన్నప్పటికి చౌరస్తాలోకి హఠాత్తుగా ఫ్లెక్సీతో రావడంతో అప్రమత్తమైన పోలీసులు అతన్ని వెంటనే అదుపులోకి తీసుకున్నారు.

అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం

బోయినపల్లి: మండలంలోని కొదురుపాకలో మోడల్ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌తో కలిసి మంత్రి కేటీఆర్ మంగళవారం ప్రారంభించారు. అంగన్‌వాడీ కేంద్రంలో మెటీరియల్‌ను పరిశీలించారు. ఆవరణలో పండిస్తున్న కూరగాయలను చూసి అభినందించారు. కొంతమంది చిన్నారులతో ముచ్చటించారు. ప్లే స్కూల్, కిచెన్ గార్డెన్ బాగుంది, వెరీ గుడ్ కీప్ ఇట్‌అప్ అని మంత్రి కేటీఆర్ కితాబిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, జెడ్పీటీసీ కత్తెరపాక ఉమ, సెస్ డైరెక్టర్ కొట్టిపెల్లి సుధాకర్ డీడబ్ల్యూవో లక్ష్మీరాజం, సీడీపీవో ఎల్లయ్య, సూపర్‌వైజర్లు అరుణ, నిర్మలాదేవి, తార, నిర్మల పాల్గొన్నారు.



చిన్నారికి ప్రతినమస్కారం చేస్తున్న మంత్రి కేటీఆర్

ఇస్సాదారుల సమస్యలను పరిష్కరించాలి

- రోడ్డుపై పడుకొని వినూత్న ప్రదర్శన
- తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన



రోడ్డుపై నిరసన తెలుపుతున్న ఇస్సాదారులు

ఎల్లారెడ్డిపేట: సుంకరి ఇస్సాదారుల సమస్యలను మంత్రి కేటీఆర్ పరిష్కరించాలని కోరుతూ ఎల్లారెడ్డిపేట మండల ఇస్సాదారులు మంగళవారం వినూత్న ప్రదర్శన చేపట్టారు. అంతకు ముందు సిరిసిల్ల–కామారెడ్డి ప్రధాన రహదారిపై పడుకొని మంత్రి కేటీఆర్ తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్మార్వో కార్యాలయానికి చేరుకుని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఇస్సాదారుల మండల అధ్యక్షుడు రేసు జగన్ మాట్లాడుతూ పాత పద్ధతిలో ఉన్న సుంకరులను కొనసాగించాలని, అసలుదారులతో సమానంగా తమకు వేతనాలు, సమాన న్యాయం చేయాలన్నారు. పనిచేసిన వారికి నగదు, చెక్కు రూపంలో అందించాలని కోరారు. మంత్రి కేటీఆర్ తమ సమస్యలను పట్టించుకుని ఆదుకోవాలన్నారు. తమ సమస్యలు పరిష్కారం కాకుంటే కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బండ నర్సింహులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని కాంగ్రెస్ ధర్నా

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా, నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం తహసీల్దార్ జయంత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య మాట్లాడుతూ మండల వ్యాప్తంగా సుమారు 1,800 మంది విద్యార్థులు ప్రతి ఏటా ఇంటర్‌ను పూర్తి చేసుకుంటున్నారని, వారికి ఉన్నత చదువులు అందడం లేదన్నారు. మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీని మరిచి జిల్లాలో పర్యటించడం సిగ్గు చేటన్నారు. ఏళ్ల గడుస్తున్న విద్యార్థులపై మంత్రి మనస్సు మాత్రం కరగడం లేదన్నారు. విద్యార్థుల సమస్యలను చెప్పడానికి వెళ్లిన నాయకులను పోలీసులతో అరెస్టులు చేయించడం దారుణమన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరయ్యే వరకు కాంగ్రెస్ పార్టీ తరుపున ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి లింగం గౌడ్, నాయకులు మహేందర్, గిరిధర్‌రెడ్డి, గౌస్, లక్ష్మారెడ్డి, రాజునాయక్, శ్రీను, సంతోష్, కిషన్, బుచ్చాగౌడ్, బాబు, రాజు, రవి, పోచయ్య, బాలయ్య, రాములు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కుట్టు శిక్షణ తీసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని లింగంపల్లి గ్రామంలో కుట్టుమిషన్ శిక్షణ తీసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఆరు నెలల క్రితం అనిత ప్రగతి పథం ఫౌండేషన్ ఆధ్వర్యంలో 15 మంది మహిళలు శిక్షణ తీసుకున్నారు. వీరికి మంగళవారం సర్టిఫికెట్లు, కుట్టుమిషన్లు అందజేశారు. సర్పంచ్ సామ కవిత, ఉపసర్పంచ్ పుల్లూరు ప్రేమల, నిర్వాహకురాలు అనిత, గ్రామ ప్రజాప్రతినిధులు తిరుపతిరెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.



శిక్షణ సర్టిఫికెట్లు అందజేస్తున్న నిర్వాహకులు

యాప్ ద్వారా శిక్షణ పూర్తి



వేములవాడఅర్బన్: జిల్లాలోని కార్మికుల పిల్లలకు ప్రభుత్వం స్వయం ఉపాధి నైపుణ్య అభివృద్ధికి వివిధ కోర్సుల్లో సెట్విన్, తెలంగాణ భవన నిర్మాణ కార్మిక శాఖ సంయుక్తంగా 26 కోర్సుల్లో యాప్ ద్వారా ఉచిత ఆన్‌లైన్ శిక్షణ ఇచ్చింది. వేములవాడ మండలంలోని అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 155 మంది శిక్షణ పూర్తయిన కార్మికుల విద్యార్థులకు మంగళవారం సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఏఎల్‌వో మహ్మద్ రఫీ, వైస్‌ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టులు



రాణాలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

వేములవాడఅర్బన్/వేములవాడరూరల్: మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా బీజేపీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడాన్ని బీజేపీ జిల్లా కార్యదర్శి బుర్ర శేఖర్‌గౌడ్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి చెట్టిపల్లి రవికిషోర్ ఖండించారు. ఈ సందర్భంగా వేర్వేరుగా మాట్లాడుతూ మిడ్ మానేరు ముంపులో నిర్వాసితులు సర్వం కోల్పోయారన్నారు. సీఎం కేసీఆర్ నిర్వాసితులకు ఇస్తానని ఇచ్చిన హామీ రూ. 5 లక్షల 4 వేలు వెంటనే అందించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. బీజేపీ నాయకులు నాగుల సురేశ్, పూర్ణచంద్, అరవింద్, జక్కుల తిరుపతి, పరమేశ్, వంశీ, గౌతమ్ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

గంభీరావుపేట: విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొర్లె తిరుపతి అన్నారు. మండల కేంద్రంలోని కేజీ టు పీజీ ప్రాంగణంలో చదువుకుంటున్న విద్యార్థులతో కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుతెన్నులను పరిశీలించారు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఖాళీగా ఉన్న ఇంగ్లిష్, సోషల్, బయోసైన్స్, పీడీ, డ్రాయింగ్ టీచర్ పోస్టులను, బాలికల ఉన్నత పాఠశాలలో ఖాళీగా ఉన్న ఇంగ్లిష్, సోషల్ టీచర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందించాలని, నాణ్యమైన భోజనం అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

పాదయాత్రలో పాల్గొనండి

గంభీరావుపేట/కోనరావుపేట: ఈ నెల 26 నుంచి ప్రారంభం కానున్న హాత్ సే హాత్ జోడోయాత్ర అభియాన్ పాదయాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండలాధ్యక్షులు హమీద్, షేక్ పిరోజ్‌పాషా కోరారు. మండల కేంద్రాల్లో నిర్వహించిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర సారాంశాన్ని దేశం నలుమూలల విస్తరించడానికి కాంగ్రెస్ గ్రామగ్రామాన ఈ కార్యక్రమాన్ని చేపట్టనుందని, పార్టీ శ్రేణులు క్రియాశీలకంగా పాల్గొనాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మభ్యపెడుతున్న వైనాన్ని ప్రజలకు తెలియజెప్పాలన్నారు.జిల్లా కార్యదర్శి గొట్టె రుక్మిణి, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

రుద్రంగి: మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ వసతిగృహం, కస్తూర్బా బాలికల పాఠశాల, రుద్రంగి జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు ఆర్‌బీఎస్‌కే వైద్యులు ప్రభాకర్ వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమున్న వారికి మందులు పంపిణీ చేశారు. జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం అంబటి శంకర్, కస్తూర్బా ఎస్‌వో వనిత, హాస్టల్ వార్డెన్ రవీంద్రస్వామి, ఏఎన్ఎం విజయ పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్ల గొల్లపల్లిలో అర్హులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను సర్పంచ్ పాశం సరోజన మంగళవారం పంపిణీ చేశారు. ఎంపీటీసీ శ్రీనివాస్, నాయకులు రమేశ్‌గౌడ్, జబ్బర్, దేవారెడ్డి, ఎల్లయ్య, ప్రకాశ్, రాజు, రవీందర్, పాల్గొన్నారు.

సమాచారం

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలు ప్రారంభం

వీర్నపల్లి: మండలంలోని మోడల్ స్కూల్‌లో అడ్మిషన్లు ప్రారంభించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ విశ్వనాథం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర మోడల్ స్కూల్‌లో 2023–24 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో వంద సీట్లు ఉన్నట్లు తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తుల ఈనెల 15 చివరి తేదీ అని, ఏప్రిల్‌లో ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు.

సంక్రాంతికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

వేములవాడఅర్బన్: సంక్రాంతికి విద్య, ఉద్యోగరీత్యా పట్టణాల్లో ఉన్న ప్రజలు స్వగ్రామాలకు చేరవేసేందుకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయనుంది. ఈ నెల 12, 13, 14 మూడు రోజులు, తిరుగు ప్రయాణంలో 16, 17కు వరకు ప్రత్యేక బస్సులను నడిపించనున్నట్లు వేములవాడ ఆర్టీసీ డిపో మేనేజర్ భీంరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్ నుంచి వేములవాడకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయనున్నారు. ప్రతి రోజు 24 బస్సులు వేములవాడ నుంచి హైదరాబాద్‌కు 38 ట్రిప్పులు నడిపించగా ఈ సంక్రాంతికి ప్రత్యేకంగా మరో 6 బస్సులను అదనంగా ఏర్పాటుతో 30 బస్సులు కలిసి మొత్తం 48 ట్రిప్పులు నడిపించనున్నట్లు తెలిపారు. ఆర్టీసీ ప్రయాణం సురక్షితమని, ప్రజలు పండగకు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణం చేయాలని డిపో మేనేజర్ కోరారు.

నియామకం

యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా బాలకృష్ణారెడ్డి

చందుర్తి: మండల యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా సంతుపూరి బాలకృష్ణారెడ్డిని నియమించినట్లు జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనాథ్, వేములవాడ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్ ఒక ప్రకటనలతో తెలిపారు. మర్రిగడ్డ గ్రామానికి చెందిన సంతుపూరి బాలకృష్ణారెడ్డి పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న అతని సేవలను గుర్తించి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా అధిష్టానం నియమించిందని తెలిపారు.

విద్యాలయాల్లో తహసీల్దార్లు తనిఖీలు



నిర్వాహకులతో మాట్లాడుతున్న తహసీల్దార్ జయంత్

ముస్తాబాద్/ఎల్లారెడ్డిపేట/గంభీరావుపేట: జిల్లాలోని కస్తూర్బా విద్యాలయాలు, గురుకులాలు, మోడల్ స్కూల్‌లను ఆయా మండలాల తహసీల్దార్లు మంగళవారం తనిఖీ చేశారు. విద్యాలయాలలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శానిటేషన్, తాగునీటి సరఫరాను పరిశీలించారు. నిర్వాహకులు తయారు చేస్తున్న భోజనాన్ని, అందిస్తున్న నీళ్లను, వంట గదిని క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే పరిశుభ్రత, మురుగునీటి సరఫరా విధానాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు వచ్చిన అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఏమైనా అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. తహసీల్దార్లు సురేశ్, జయంత్, మధుసుదన్‌రెడ్డి, ఆర్‌ఐ శ్యామ్, ప్రిన్సిపాల్ అరుణ్‌కుమార్, ప్రత్యేకాధికారి శ్రీలత, వసంత ఉన్నారు.



తనిఖీ చేస్తున్న గంభీరావుపేట తహసీల్దార్